సజావుగా గ్రూప్-3 పరీక్షలు

- మొదటి రోజు 53శాతం అభ్యర్థుల హాజరు
- పరీక్ష కేంద్రాలను పరిశీలించిన అధికారులు

స్ట్రాంగ్ రూమ్‌లో భద్రపరుస్తున్న ఓఎంఆర్ షీట్ల బాక్సులను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్లు, ఆర్డీవో, అధికారులు

కలెక్టరేట్, నవంబర్ 17: టీజీఎస్‌పీఎస్సీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గ్రూప్-3 పరీక్షలు జిల్లాలో మొదటి రోజు సజావుగా ముగిశాయి. మొత్తం 26,415 మంది అభ్యర్థులకు పేపర్ 1కు 14,104 మంది, పేపర్ 2కు 14,009 మంది, 53శాతం పైచిలుకు అభ్యర్థులు హాజరైనట్లు అధికారులు ప్రకటించారు. పరీక్షల నిబంధనలపై అధికార యంత్రాంగం ముందుగానే సూచనలు చేయడంతో అభ్యర్థులంతా సకాలంలో పరీక్ష కేంద్రాలకు చేరుకున్నారు. హాల్‌టికెట్, గుర్తింపు కార్డులు పరిశీలిస్తూ, క్షుణ్ణంగా తనిఖీ చేసిన అనంతరం లోనికి పంపించారు. కేంద్రాల పరిసరాల్లో 144వ సెక్షన్ విధించడంతో ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగలేదు. నగరంలోని పలు పరీక్ష కేంద్రాలను అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్ సందర్శించారు. పరీక్ష జరుగుతున్న తీరును పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, పరీక్ష కేంద్రాల్లో అభ్యర్థులకు సౌకర్యాలు కల్పించాలని, ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా ఫ్లయింగ్‌స్క్వాడ్ సిబ్బంది చర్యలు తీసుకోవాలని సూచించారు. అంతకుముందు జిల్లా కేంద్రంలోని జడ్పీ కార్యాలయంలో ప్రశ్నాపత్రాలు భద్రపరిచిన స్ట్రాంగ్‌రూముల సీలును సిబ్బంది అదనపు కలెక్టర్, ఇతర అధికారుల సమక్షంలో తీశారు. అనంతరం పోలీసు బందోబస్తు మధ్య ప్రశ్నాపత్రాలు పరీక్ష కేంద్రాలకు తరలించారు. కార్యక్రమంలో ఆర్డీవో కె.మహేశ్వర్, టౌన్ ఏసీపీ విజయ్‌కుమార్, పరీక్ష రీజనల్ కోఆర్డినేటర్లు వరలక్ష్మి, సతీశ్, సీఐలు కోటేశ్వర్, విజయ్‌కుమార్, జాన్‌రెడ్డి, కలెక్టరేట్ సూపరింటెండెంట్ కాళీచరణ్‌గౌడ్, తదితరులు ఉన్నారు.

తిమ్మాపూర్, నవంబర్ 17: మండలంలోని జ్యోతిష్మతి, శ్రీ చైతన్య, వాగేశ్వరి ఇంజినీరింగ్ కళాశాలల్లో నిర్వహించిన గ్రూప్-3 పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. పలువురు అభ్యర్థులు ఆలస్యంగా రావడంతో అధికారులు వారిని పరీక్షకు అనుమతించలేదు. కాగా, ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా పోలీసులు పకడ్బందీ చర్యలు తీసుకున్నారు. పలు సెంటర్లలో అధికారులు పర్యవేక్షించారు.

తిమ్మాపూర్: ఆలస్యంగా రావడంతో పరీక్ష రాయలేకపోయిన అభ్యర్థులు

మానేరు రివర్ ఫ్రంట్‌కు జగపతిరావు పేరు పెట్టాలి

ఎమ్మెల్యే గంగుల కమలాకర్‌కు వినతి పత్రం అందజేస్తున్న వెలిచాల సాధన సమితి బాధ్యులు

రాంనగర్, నవంబర్ 17: సుదీర్ఘ కాలం ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే, మార్క్ ఫెడ్ చైర్మన్‌గా పని చేసి ప్రజలకు అత్యుత్తమ సేవలందించిన, తెలంగాణ ఉద్యమకారుడు, దివంగత కాంగ్రెస్ సీనియర్ నేత వెలిచాల జగపతిరావు పేరును కరీంనగర్‌లోని మానేరు రివర్ ఫ్రంట్‌కు పెట్టాలని వెలిచాల సాధన సమితి నేతలు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆదివారం తిమ్మాపూర్‌లో మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, కరీంనగర్‌లో ఎమ్మెల్యే గంగుల కమలాకర్, నగర మేయర్ వై సునీల్ రావుతో పాటు పలువురు ముఖ్య నేతలకు వెలిచాల సాధన సమితి కన్వీనర్ సరిల్ల రతన్ రాజు, కో కన్వీనర్ గండి రాజేశ్వర్, అడ్వైజర్లు దర్శనాల నారాయణ, ఎండీ ఖషిద్, పులి నరసింహారావు, డైరెక్టర్ చిందం శ్రీనివాస్ వినతి పత్రాలు అందజేశారు. జగపతిరావు అందించిన సేవలకు గానూ మానేరు రివర్ ఫ్రంట్‌కు ఆయన పేరు పెట్టేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ ఏరియా పరిధిలో విగ్రహం ఏర్పాటు చేసేందుకు 20 గుంటల స్థలం కేటాయించాలని విజ్ఞప్తి చేశారు.

అట్టహాసంగా లక్ష్ చాంపియన్ ట్రోఫీ

విజేతలకు ట్రోఫీ అందజేస్తున్న నిర్వాహకులు

కొత్తపల్లి, నవంబర్ 17 : పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి, లక్ష్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ ముస్తాఖ్ అలీ ఆధ్వర్యంలో నిర్వహించిన 'లక్ష్ చాంపియన్ ట్రోఫీ' అట్టహాసంగా సాగింది. కరీంనగర్ బైపాస్ వద్దగల అహ్మద్ ఈద్గా ప్రాంగణంలో 'సే నో టు డ్రగ్స్ – సే ఎస్ టూ ఫిట్‌నెస్' అనే స్ఫూర్తిని యువతలోకి తీసుకెళ్లాలనే ఉద్దేశంతో ఈ పోటీలు నిర్వహించినట్లు ఆయన పేర్కొన్నారు. ఇందులో పాత కరీంనగర్, వరంగల్ జిల్లాల నుంచి 16 జట్లు పాల్గొనగా, విన్నర్‌గా వీఆర్ XI, రన్నరప్‌గా 'హందాన్ – XI టీమ్స్ నిలిచాయని వెల్లడించారు. విజేతలకు నగదు బహుమతితో పాటు ట్రోఫీ కోచ్ మహ్మద్ ఆసిఫ్ చేతుల మీదుగా ప్రదానం చేశారు.

మాలల సింహగర్జన విజయవంతం చేయాలి

తెలంగాణచౌక్, నవంబర్ 17: ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా మాలలను ఐక్యం చేయడానికి డిసెంబర్ 1న హైదరాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహిస్తున్న మాలల సింహగర్జనను విజయవంతం చేయాలని మాలల ఐక్యత అభివృద్ధి కమిటీ సలహాదారు కొరివి వేణుగోపాల్, కన్వీనర్ ఈసారి జనార్దన్, కో కన్వీనర్ హర్ష మల్లేశం, ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి రాష్ట్ర కోచైర్మన్ నల్లాల కనకరాజు, నాయకులు గంట శ్రీనివాస్, ప్రసాద్ పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆదివారం నగరంలోని ప్రెస్ భవనంలో సింహగర్జన పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఎస్సీ వర్గీకరణ నిలిపివేయాలని డిమాండ్ చేశారు. సింహగర్జనకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మాలలు వేల సంఖ్యలో తరలిరావాలన్నారు. మాలల ఐక్యపోరాటాలతో హక్కులు సాధించుకోవాలన్నారు. సమావేశంలో నాయకులు మేడ రాజవీరు. రమేశ్, మాలమహానాడు జిల్లా అధ్యక్షుడు శంకర్, మల్లయ్య, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఫీజు బకాయిలు విడుదల చేయాలి

- లేకుంటే ప్రభుత్వంపై విద్యార్థుల తిరుగుబాటు తప్పదు
- ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠ రెడ్డి

కమాన్‌చౌరస్తా, నవంబర్ 17: రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న విద్యారంగ సమస్యలు పరిష్కరించడంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిర్లక్ష్యం చేస్తున్నారని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠ రెడ్డి విమర్శించారు. రేవంత్ రెడ్డి చెప్పిన మాటలకు, అనుసరిస్తున్న విధానాలకు పొంతన లేదని, ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలు విడుదల చేయకపోతే విద్యార్థి లోకం ప్రభుత్వంపై తిరుగుబాటు చేస్తుందని హెచ్చరించారు. ఎన్నికల మ్యానిఫెస్టోలో విద్యార్థులకు ఎలక్ట్రిక్ స్కూటీలు, ల్యాప్‌ట్యాప్‌లు ఇస్తామని చెప్పి అధికారంలోకి వచ్చి, పదకొండు నెలలు కావస్తున్నా వాటి ఊసే లేదని, ప్రభుత్వ పాఠశాలల్లో కనీస మౌలిక వసతులు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. స్కాలర్‌షిప్స్, ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులపై ఆధారపడి నడిచే కళాశాలల యాజమాన్యాలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని తెలిపారు. బడ్జెట్‌లో కూడా విశ్వవిద్యాలయాలకు సరిపడా నిధులు కేటయించకుండా, టీచింగ్, నాన్ టీచింగ్ పోస్టులు భర్తీ చేయకుండా రాష్ట్ర ప్రభుత్వం కాలయాపన చేస్తున్నదని మండిపడ్డారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విద్యారంగంపై వెంటనే సమీక్ష నిర్వహించి, విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని కోరారు. పెండింగ్ ఫీజు బకాయిలను విడుదల చేయాలని, లేకుంటే విద్యార్థులను సమీకరించి సమస్యల పరిష్కారానికి ఉద్యమిస్తామని ఆదివారం విడుదల చేసిన ఒక ప్రకటనలో హెచ్చరించారు.

నేడు డయల్ యువర్ డీఎం

తెలంగాణచౌక్, నవంబర్ 17: డిపో –2 పరిధిలోని కరీంనగర్, చొప్పదండి, ధర్మారం, గంగాధర మండలాల ప్రయాణికుల నుంచి సలహాలు, సూచనలు స్వీకరించడానికి డిపో-2 మేనేజర్ కార్యాలయంలో సోమవారం డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు డిపో-2 డీఎం మల్లయ్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రయాణికులు ఉదయం 11 నుంచి 12 గంటల వరకు సెల్ నంబర్ 9959225921లో సంప్రదించాలని సూచించారు.

ఫీజు చెల్లించేందుకు 23 ఆఖరు

కమాన్‌చౌరస్తా, నవంబర్ 17: శాతవాహన యూనివర్సిటీ పరిధిలో హోటల్ మేనేజ్‌మెంట్ మొదటి, మూడో, ఐదో సెమిస్టర్ పరీక్షల ఫీజు ఈ నెల 23లోగా చెల్లించాలని పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ శ్రీరంగ ప్రసాద్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అపరాధ రుసుము రూ.300తో ఈ నెల 27వ తేదీ వరకు చెల్లించవచ్చని సూచించారు.

చెర్లభూత్కూర్‌లో పర్యటించిన రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ చైర్మన్

కరీంనగర్ రూరల్, నవంబర్ 17: కరీంనగర్ మండలం చెర్లభూత్కూర్ గ్రామంలో రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య ఆదివారం పర్యటించారు. గ్రామంలోని జరిగిన ఓ ప్రైవేట్ కార్యక్రమంలో పాల్గొన్నారు. గ్రామంలోని పలువురిని కలిసి పరామర్శించారు. ఆయన వెంట కాంరెడ్డి రాంరెడ్డి, సాయిని తిరుపతి, గ్రామ నాయకులు ఉన్నారు.

క్రీడాకారులు క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించాలి

తాడికల్‌లో విజేతకు ట్రోఫీ అందజేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి

శంకరపట్నం, నవంబర్ 17: క్రీడల్లో క్రీడాకారులు క్రీడా స్ఫూర్తి ప్రదర్శించాలని ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ పేర్కొన్నారు. ఆదివారం తాడికల్ గ్రామంలో కరివేద సదాశివరెడ్డి స్మారక క్రికెట్ టోర్నీని ఆదర్శ హాస్పిటల్ ఆధ్వర్యంలో నిర్వహించారు. పోటీల్లో మొగిలిపాలెం టీం విన్నర్‌గా, మద్దికుంట రన్నరప్‌గా నిలిచింది. బహుమతి ప్రదానోత్సవానికి హాజరైన ఎమ్మెల్యే క్రీడాకారులకు బహుమతులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ బత్తిని శ్రీనివాస్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు బసవయ్య, ఆలయ చైర్మన్ మల్లారెడ్డి, ఏఎంసీ చైర్మన్ నాంపల్లి తిరుపతి, క్రీడాకారులు, తదితరులు పాల్గొన్నారు.

నిరుపేద విద్యార్థికి ఎమ్మెల్యే ఆపన్న హస్తం

శంకరపట్నం, నవంబర్ 17: ఆర్థిక సమస్యలతో ఫీజు చెల్లించలేని స్థితిలో ఉన్న ఓ విద్యార్థికి ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ ఆపన్న హస్తం అందించారు. లింగాపూర్ గ్రామానికి చెందిన గొర్రె అంజన్ అనే విద్యార్థి కేరళలోని కాలికట్ కళాశాలలో ఎన్ఐటీ రెండో సంవత్సరం చదువుతున్నాడు. పరీక్షలకు ఫీజు చెల్లించే ఆర్థిక స్థోమత లేకపోవడంతో కుటుంబ సభ్యులు ఆదివారం ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లిని తిమ్మాపూర్ క్యాంపు కార్యాలయంలో కలిసి పరిస్థితిని వివరించారు. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే రూ. 50 వేలు ఇచ్చి ఫీజు చెల్లించారు. చదువు పూర్తి అయ్యే వరకు అండగా ఉంటానని విద్యార్థికి భరోసా ఇచ్చారు. బాగా చదివి ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్ష వ్యక్తం చేశారు.

ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించడం అభినందనీయం

ఉచిత వైద్యశిబిరంలో పరీక్షలు చేసుకుంటున్న ఎమ్మెల్యే సత్యం

చొప్పదండి, నవంబర్ 17: బిగ్ టీవీ, రెనె హాస్పిటల్ యాజమాన్యం సామాజిక బాధ్యతతో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించడం అభినందనీయమని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర పాఠశాలలో బిగ్ టీవీ, రెనె హాస్పిటల్ సౌజన్యంతో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే ప్రారంభించి మాట్లాడారు. ఇలాంటి శిబిరాలతో పేద, మధ్య తరగతి ప్రజలకు వైద్య సేవలు చేరువవుతాయన్నారు. చొప్పదండి నియోజకవర్గంలోని అన్ని మండలాల్లోనూ ఉచిత వైద్యశిబిరాలు నిర్వహించాలని కోరారు. అనంతరం చొప్పదండిలోని పలు వివాహ కార్యక్రమాల్లో పాల్గొని వధూవరులను ఆశీర్వదించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ గుర్రం నీరజ, మార్కెట్ కమిటీ చైర్మన్ కొత్తూరు మహేశ్, డీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ కోమటిరెడ్డి పద్మాకర్ రెడ్డి, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు ఇప్ప శ్రీనివాస్ రెడ్డి, పట్టణాధ్యక్షుడు నిజనాపురం చందు, కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు పురం రాజేశం, జిల్లా అధికార ప్రతినిధి పెరుమాండ్ల గంగయ్యగౌడ్, కౌన్సిలర్ కొట్టే అశోక్, నాయకులు ముద్దం తిరుపతి, రాజేందర్‌రెడ్డి, గుర్రం రమేశ్, కడారి శంకర్, విద్యాసాగర్‌రెడ్డి, కృష్ణహరి, కైలాసపతి, రాములు, గుంటి స్వరూప, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రేపు దివ్యాంగులకు ఆటల పోటీలు

కలెక్టరేట్, నవంబర్ 17: ఈ నెల 19న దివ్యాంగులకు ఆటలపోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా సంక్షేమాధికారి ఎం.సరస్వతి తెలిపారు. దివ్యాంగుల దినోత్సవాన్ని (డిసెంబర్ 3) పురస్కరించుకుని, మహిళలు, పిల్లలు, దివ్యాంగులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఆటల పోటీలు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. పోటీల్లో పాల్గొనే దివ్యాంగులు తమ సదరం సర్టిఫికెట్, ఆధార్‌కార్డు జిరాక్స్ కాపీలతో నగరంలోని అంబేద్కర్ స్టేడియంలో ఉదయం 9గంటలకు హాజరుకావాలని సూచించారు. అక్కడే పేరు నమోదు చేసుకుని పోటీల్లో పాల్గొనవచ్చన్నారు. 10 నుంచి 17 ఏళ్ల వారికి జూనియర్ విభాగంలో, 18 నుంచి 54 ఏళ్లలోపు వారికి సీనియర్ విభాగంలో పోటీలు ఉంటాయని పేర్కొన్నారు. చెస్, క్యారం, షాట్‌పుట్, రన్నింగ్ పోటీలు నిర్వహించనుండగా, జిల్లాస్థాయిలో గెలుపొందే వారికి రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొనే అవకాశం ఉంటుందన్నారు. దివ్యాంగులు, దివ్యాంగ ఉద్యోగులు అధిక సంఖ్యలో పాల్గొని ఆటల పోటీలు విజయవంతం చేయాలని ఆదివారం విడుదల చేసిన ప్రకటనలో కోరారు.

ఆర్టీసీ లాజిస్టిక్స్ హోమ్ డెలివరీ సర్వీసులు వినియోగించుకోవాలి

తెలంగాణచౌక్, నవంబర్ 17: టీజీ ఆర్టీసీ హైదరాబాద్, సికింద్రాబాద్ జంట నగరాల్లో అందిస్తున్న హోమ్ డెలివరీ సర్వీసులను ఉమ్మడి కరీంనగర్ జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని లాజిస్టిక్స్ బిజినెస్ హెడ్ శ్రీధర్ కోరారు. జిల్లా కేంద్రంలోని బస్టాండ్ ఆవరణలో గల లాజిస్టిక్స్ కేంద్రాన్ని, జగిత్యాల రోడ్‌లో గల ఆర్టీసీ పెట్రోల్ పంపును ఆదివారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, హైదరాబాద్‌లో విద్యనభ్యసిస్తున్న పిల్లలకు, ఉద్యోగాలు చేస్తున్న బంధు మిత్రులకు పంపించే వస్తువులను నేరుగా చిరునామా వద్దకు హోమ్ డెలివరీ చేయనున్నట్లు పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా మండల కేంద్రాలు, గ్రామాల్లోని లాజిస్టిక్స్ కేంద్రాల్లో వస్తువులను బుకింగ్ చేసుకొనే సదుపాయం ఉందన్నారు. త్వరలో జిల్లా కేంద్రాల్లో కూడా హోమ్ డెలివరీ చేయాలనే ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు తెలిపారు. ఆయన వెంట కరీంనగర్ రీజియన్ మేనేజర్ రామారావు, ఉమ్మడి జిల్లా మార్కెటింగ్ సేల్స్ లీడర్ రాజు ఉన్నారు.

'తరుగు పేరుతో అదనపు తూకం'

శంకరపట్నం, నవంబర్ 17: అధికారులు, మిల్లర్లు కుమ్మక్కై తాలు, తరుగు పేరుతో రైతులను మోసం చేస్తున్నారని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి అలివేలి సమ్మిరెడ్డి ఆరోపించారు. ఆదివారం ఆయన మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గద్దపాక సింగిల్ విండో ధాన్యం కొనుగోలు కేంద్రంలో నిర్వాహకులు 40 కిలోలకు గాను 42 కిలోల ధాన్యం తూకం వేసి రైతులకు నష్టం కలిగిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ రకంగా రైతులు తెచ్చే ఒక్కో ట్రాక్టర్‌కు రెండు క్వింటాళ్ల ధాన్యం నష్టపోతున్నట్లు తెలిపారు. 40 కిలోలకు గన్నీ బ్యాగు బరువు మాత్రమే తరుగు తీస్తామని ప్రకటించిన ప్రభుత్వం, అదనపు తూకం వేస్తూ రైతుల నడ్డి విరుస్తున్నదని మండి పడ్డారు. గన్నీ బ్యాగు బరువు మినహాయించి 40 కిలోలు తూకం వేయాలని డిమాండ్ చేశారు. లేదా రైతులను సమీకరించి ఆందోళన నిర్వహిస్తామని హెచ్చరించారు.

మొక్కలు నాటిన యువశక్తి యూత్ నాయకులు



కార్యక్రమంలో పాల్గొన్న యువశక్తి యూత్ నాయకులు

కొత్తపల్లి, నవంబర్ 17 : ప్రధాని నరేంద్రమోడీ పిలుపుమేరకు 'ఏక్ పేడ్ మా కె నామ్' కార్యక్రమంలో భాగంగా యువశక్తి యూత్ ఆధ్వర్యంలో యువకులు ఆదివారం తీగలగుట్టపల్లిలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా యూత్ నాయకులు మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ తల్లి పేరుతో ఇంట్లో ఒక మొక్క నాటి పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో యువజన సంఘాల నాయకులు తొర్తి శ్రీనివాస్, యువశక్తి యూత్ గౌరవ సలహాదారులు జగదీశ్వరాచారి, జయంత్, అనిల్, నవదీప్, బ్రహ్మం తదితరులు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED

WANTED HELPERS
jobs Apply Now!
★హరేకృష్ణ హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 16K to 18K, ఏజెంట్ కమీషన్ 6K. Ph: 9640258899 / 9640468899.
NT-338958-All

CHANGE OF NAME
★I, Pittala Lasya Sri W/o. Pittala Naresh (Old Name) H.No. 8-69, Rudrangi Village & Mandal Rajanna Siricilla Dist. My Name Was Changed To PITTALA KAVYA W/o. PITTALA NARESH (New Name)
NTK-00000

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన
నమస్తే తెలంగాణ
క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం
200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి
50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
Cell: 9182 777 571
9182 777 189

గ్యాస్ లీకై చెలరేగిన మంటలు

దంపతులిద్దరికీ గాయాలు

రాంనగర్, నవంబర్ 17: నగరంలోని సీతారాంపూర్‌లో ఆదివారం సాయంత్రం ఓ ఇంట్లో గ్యాస్ లీక్ అయి అకస్మాత్తుగా మంటలు చెలరేగాయి. కుటుంబ సభ్యుల ఆర్తనాదాలతో చుట్టుపక్కల వారు అప్రమత్తమై ఫైర్ స్టేషన్‌కు సమాచారం అందించారు. అక్కడికి చేరుకున్న ఫైర్ అధికారులు గాయపడిన భార్యాభర్తలు ఇద్దరినీ అంబులెన్స్ సహాయంతో నగరంలోని ఓ ప్రైవేటు హాస్పిటల్‌కు తరలించారు. గంట పాటు శ్రమించి మంటలు అదుపులోకి తీసుకువచ్చారు. కొత్త ఇల్లు కావడంతో కప్‌బోర్డ్స్, ఫర్నిచర్ పూర్తిగా కాలిపోయాయి. లీకైన గ్యాస్ సిలిండర్‌ను ఫైర్ సిబ్బంది చాకచక్యంగా అదుపు చేసి బయటపడేయడంతో మంటలు అదుపులోకి వచ్చాయి. గాయపడిన భార్యాభర్తలను రామస్వామి, లతగా గుర్తించారు. రామస్వామి పోలీస్ శాఖలో పనిచేస్తుండగా లత గృహిణి.

బాధిత కుటుంబానికి బియ్యం వితరణ

శంకరపట్నం, నవంబర్ 17: గద్దపాక ఎస్సీ కాలనీలో నిరుపేద కుటుంబానికి చెందిన సోమిడి బొందమ్మ అనే మహిళ అనారోగ్యంతో మృతి చెందగా, ఆమె కుటుంబానికి గ్రామ యువత ముందుకు వచ్చి ఆదివారం 50 కిలోల బియ్యం అందజేశారు. వారిని గ్రామస్తులు అభినందించారు.

పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న అతిథులు

వైవిధ్య కవితల సమాహారం 'హృదయ విరులు'

- కేంద్ర సాహిత్య అకాడమీ సభ్యుడు నాళేశ్వరం శంకరం

కమాన్‌చౌరస్తా, నవంబర్ 17 : భిన్నమైన అంశాలతో, వైవిధ్యమైన కవితలతో కూడినది హృదయ విరులు కవితా సంపుటి అని కేంద్ర సాహిత్య అకాడమీ అడ్వైజరీ బోర్డు సభ్యుడు, తెలంగాణ రచయితల సంఘం అధ్యక్షుడు నాళేశ్వరం శంకరం పేర్కొన్నారు. భవానీ సాహిత్య వేదిక ఆధ్వర్యంలో వైరాగ్యం ప్రభాకర్ అధ్యక్షతన ఆదివారం స్థానిక ఫిలింభవన్‌లో జరిగిన సాహిత్య సభకు ముఖ్య అతిథిగా హాజరై, వర్ధమాన కవయిత్రి మాంకాలి సుగుణ రచించిన హృదయ విరులు కవితా సంపుటిని ఆవిష్కరించారు. కార్యక్రమానికి విశిష్ట అతిథిగా సినీగీత రచయిత, తెలుగు విశ్వవిద్యాలయం బంగారు పతక గ్రహీత సాదనాల వేంకటస్వామి నాయుడు, గౌరవ అతిథిగా ముల్కనూర్ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ హర్జిత్ కౌర్ హాజరు కాగా, తెలంగాణ తెలుగు భాషా సంరక్షణ సంఘం ప్రధాన కార్యదర్శి బొమ్మకంటి కిషన్, నీలగిరి అనిత, తెలంగాణ రచయితల సంఘం అధ్యక్షుడు కొత్త అనిల్ కుమార్, తెరవే ప్రధాన కార్యదర్శి దామరకుంట శంకరయ్య, ప్రముఖ కథా రచయిత బీవీఎన్ స్వామి, ముదుగంటి సుధాకర్ రెడ్డి, బాల సాహితీవేత్త పెందోట వెంకటేశ్వర్లు, డాక్టర్ ఏదునూరి వెంకటేశ్వర్లు, బోయిని సంపత్, రాము ఇటిక్యాల్, జనగాని యుగంధర్, కోరుకంటి శశి కిరణ్మయి, యోగాచార్య సంపత్ కుమార్, పాక రాంమోహన్, తడిగొప్పుల కుమారస్వామి, వెల్ముల జయపాల్ రెడ్డి, కసిరెడ్డి జలంధర్ రెడ్డి, మానుపాటి రాజయ్య, మాసం సీమ, పెద్దిరాజు సత్యనారాయణ రాజు, నడిమెట్ల రామయ్య, రాపర్తి వెంకటేశ్వర్లు, కవయిత్రి సోదరుడు బాపు తదితరులు పాల్గొన్నారు.

బావిలో పడి ఒకరి మృతి

తిమ్మాపూర్, నవంబర్ 17: గొల్లపల్లి గ్రామంలో ప్రమాదవశాత్తు బావిలో పడి గ్రామానికి చెందిన రాచకట్ల కిషన్(42) మృతి చెందాడు. ఆదివారం ఉదయం ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఆయన తిరిగి రాకపోవడంతో అనుమానం వచ్చిన కుటుంబ సభ్యులు, బంధువులు గాలించగా ఓ రైతు వ్యవసాయ బావిలో మృతదేహం కనిపించింది. స్థానికులు పోలీసులకు సమాచారం అందించగా ఎల్ఎండీ ఎస్ఐ వివేక్ ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని వెలికి తీసి పోస్టుమార్టం కోసం ప్రభుత్వ దవాఖానకు తరలించారు. మృతుడికి భార్య, ఇద్దరు బిడ్డలు ఉండగా, అంత్యక్రియల ఖర్చుల కోసం గ్రామానికి చెందిన మామిడి అనిల్ కుమార్ రూ.5 వేల ఆర్థిక సాయం అందజేశారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

మానకొండూర్, నవంబర్ 17: మండల కేంద్రానికి చెందిన నెల్లి రమేశ్ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందగా, బాధిత కుటుంబాన్ని ఆదివారం శ్రీచైతన్య యూత్ క్లబ్ సభ్యులు పరామర్శించారు. మృతుడి తల్లికి రూ.20 వేల నగదు, 50 కిలోల బియ్యం అందజేశారు. ఇక్కడ క్లబ్ అధ్యక్షుడు నెల్లి మురళి, సభ్యులు రవీందర్, అనిల్, సతీశ్, రాకేశ్, శ్రీనివాస్, శ్రీకాంత్, అవినాష్, శ్రావణ్, జంగపల్లి రాజు తదితరులున్నారు.

21న ఇంటర్వ్యూలు

కమాన్‌చౌరస్తా, నవంబర్ 17: జిల్లాలోని నిరుద్యోగ యువత కోసం ప్రైవేటు సంస్థల్లో ఉద్యోగాలకు ఈనెల 21న ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి వై తిరుపతి రావు ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా, శ్రీరాం లైఫ్ ఇన్సూరెన్స్‌లో బిజినెస్ డెవలప్‌మెంట్ ఎగ్జిక్యూటివ్స్ పోస్టులు 40 ఖాళీలు ఉన్నాయని పేర్కొన్నారు. ఫైర్ స్టేషన్ సమీపంలోని కశ్మీర్‌గడ్డ మీ సేవ కార్యాలయంలో ఉన్న జిల్లా ఎంప్లాయ్‌మెంట్ కార్యాలయంలో ఇంటర్వ్యూలు ఉంటాయని తెలిపారు. వివరాలకు 90009 51722, 99082 30384, 72067 59969 సెల్ నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

ఆర్టీసీ బస్టాండ్‌లో ఇద్దరు దొంగల పట్టివేత

తెలంగాణచౌక్, నవంబర్17: జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో ఆదివారం రాత్రి దొంగతనాలకు పాల్పడుతున్న రాజు, అజిత అనే దొంగలను పట్టుకున్నట్లు సెక్యూరిటీ ఏఎస్ఐ లక్ష్మతి తెలిపారు. బస్టాండ్‌లో బస్సు ఎక్కుతున్న శ్రీనివాస్ అనే ప్రయాణికుడి జేబు నుంచి పర్సు దొంగలించి పారిపోతున్న రాజును, మల్లయ్య అనే ప్రయాణికుడి జేబు నుంచి రూ.15వేల నగదును దొంగలిస్తుండగా అజితను తోటి ప్రయాణికులు గమనించి పట్టుకున్నట్లు వివరించారు. వీరిద్దరిని విచారించి వన్ టౌన్ పోలీసులకు అప్పగించామన్నారు. ప్రయాణికులు బస్సు ఎక్కే తొందరలో జాగ్రత్తగా ఉండాలని ఏఎస్ఐ సూచించారు. ఇక్కడ సెక్యూరిటీ సిబ్బంది కొమురయ్య, కవిత ఉన్నారు

'సమగ్ర సర్వే గడువు పొడిగించాలి'

కమాన్‌చౌరస్తా, నవంబర్ 17 : సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే గడువు 22వ తేదీ వరకే ఉండడంతో ఉపాధ్యాయినులు తీవ్ర మానసిక ఒత్తిడి పెరిగి, సాయంత్రం ఎక్కువ సేపు సర్వే చేస్తూ ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని టీపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి మాడుగుల రాములు పేర్కొన్నారు. టీపీటీఎఫ్ జిల్లా శాఖ అత్యవసర సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఒక్కొక్కరికి 150 కుటుంబాలు అని చెప్పి, తర్వాత 170 నుంచి 180 కుటుంబాల వరకు కేటాయించడం వల్ల ఉపాధ్యాయులపై తీవ్ర ఒత్తిడి పెరుగుతున్నదన్నారు. వెంటనే దీనిపై ప్రభుత్వం పునరాలోచించాలని, ఈ నెల 30వ తేదీ వరకు సర్వే గడువు పొడిగించాలని డిమాండ్ చేశారు. ఇక్కడ టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు జింకే రామచంద్రారెడ్డి, ప్రధాన కార్యదర్శి వేల్పుల బాలయ్య తదితరులు ఉన్నారు.

చదరంగం పోటీలకు స్పందన

కొత్తపల్లి, నవంబర్ 17: జీనియస్ చెస్ అకాడమీలో ఆదివారం జరిగిన ఉమ్మడి జిల్లా స్థాయి ఆహ్వానిత చదరంగం పోటీలకు క్రీడాకారుల నుంచి విశేష స్పందన లభించింది. ఈ పోటీల్లో ఉమ్మడి జిల్లా నుంచి సుమారు 80 మంది క్రీడాకారులు పాల్గొని ప్రతిభ చాటారు. గెలుపొందిన క్రీడాకారులకు అకాడమీ బాధ్యులు నగదు బహుమతి అందజేశారు. కార్యక్రమంలో పడాల అజయ్, కోన శ్రీనివాస్, శ్యాం కుమార్, జీనియస్ చెస్ అకాడమీ డైరెక్టర్ కంకటి అనూప్‌కుమార్, ఆర్బిటర్ అరుణ్ రంగవేణి, కోచ్‌లు సృజన్ కుమార్, అభిరామ్, నితిన్, తరుణ్, శ్రీనిజ పాల్గొన్నారు.

పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులు

బాలికల హక్కుల పరిరక్షణ అందరి బాధ్యత

కమాన్‌చౌరస్తా, నవంబర్ 17 : బాలికల హక్కుల పరిరక్షణ అందరి బాధ్యత అని, వారి అభివృద్ధికి మనందరం తల్లిదండ్రులతో పాటు సహకరించాలని కరీంనగర్ చర్చ్ ఆఫ్ సౌత్ ఇండియా కేంద్ర గురువు రెవరెండ్ పాల్ కోమల్ పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలో బాలికల సండే కార్యక్రమం సందర్భంగా మాట్లాడారు. చిన్నారుల భవిష్యత్తుకు కావాల్సిన ప్రణాళికలను ఇప్పటి నుంచే తల్లిదండ్రులు రూపొందించుకోవాలని ఉద్బోధించారు. ఈ సందర్భంగా బాలికలు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో దేవాలయ కమిటీ కార్యదర్శి దేవదాస్, సండే స్కూలు ఉపాధ్యాయులు, బాల బాలికలు పాల్గొన్నారు.